క్లుప్తంగా

ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ల అందజేత


ఆక్సిజన్ మిషన్లను అందిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిలా రెడ్ క్రాస్ బ్రాంచ్‌కు కర్నూలు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి బుధవారం 5 ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను అందజేశారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం నంద్యాల చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఐఎంఏ వైద్యుల సలహాలతో పేద ప్రజలకు సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ రామచంద్రరావు, శ్రీనివాస్, మారుతీ కుమార్, నాగేశ్వరరావు, ఉస్మాన్ బాషా, సురేంద్ర, మద్దిలేటి, చైతన్య, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆర్జిత సెలవులు ఇవ్వాలి


మాట్లాడుతున్న విజయరావు

గోస్పాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవులలో పాఠశాలకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు ఇవ్వాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలకు హాజరవుతున్న ఉపాధ్యాయులను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించి 30 ఆర్జిత సెలవులు ఇవ్వాలన్నారు. గతంలో వేసవి సెలవులు ఉన్నాయని ఉపాధ్యాయులకు కేవలం 6 ఆర్జిత సెలవులు మాత్రమే ఇచ్చేవారని, నేడు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు వేసవి సెలవుల్లో కూడా పాఠశాలలకు హాజరవుతున్నందున వారి శ్రమను గుర్తించాలన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా జలాభిషేకం


మేళతాళాలతో చెరువుకట్ట నుంచి గంగా జలాన్ని తీసుకొస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి రజతోత్సవ కల్యాణమహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు జలాభిషేకం వైభవంగా నిర్వహించారు. మూల విరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ నరసింహస్వామి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేపట్టి చెరువు కట్ట నుంచి గంగా జలాన్ని తెచ్చి, అనంతరం కలశస్థాపన, ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా జలాభిషేకం, పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజన సేవ జరిపించారు. చివరగా పట్టువస్త్రాలతో అలంకరించి మహానైవేద్యాన్ని సమర్పించి, మహామంగళహారతులు ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు మధుసూదనరాయల్, వేదపండితులు రామ్మూర్తి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

బొమ్మలసత్రం: వారం క్రితం ఎస్బీఐ కాలనీలోని పెద్ద చెరువులో ప్రమాదవశాత్తు నీటిలో పడ/ మృతిచెందిన మహేష్, హరి కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎస్బీఐ కాలనీలో మృతుల కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా తహసీల్దార్‌ను ఆదేశించామన్నారు. మృతుడు హరికి ఆరు నెలల బాలుడు ఉన్నాడని తీవ్ర అనారోగ్యంతో కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని బాలుడికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరామన్నారు. కౌన్సిలర్ భాస్కర్, రమేష్, సుధాకర్, సుబ్బరాయుడు ఉన్నారు.

ఉపాధి కూలీ మృతి


లక్ష్మిదేవి (ఫైల్)

ఉయ్యాలవాడ: మండలంలోని కాకరవాడ గ్రామానికి చెందిన ఉపాధి కూలీ సింగిరప్పగారి లక్ష్మిదేవి (73) పనులు చేస్తూ ఎండ తీవ్రతకు కిందపడి మృతి చెందింది. వివరాలు.. రోజులాగే బుధవారం గ్రామ సమీపంలోని కర్రా హర్షవర్ధన్‌రెడ్డికి సంబంధించిన ఫీల్డ్ ఛానల్‌లో పూడికతీత పనులకు వెళ్లారు. పనులు చేస్తుండగా ఆమె ఒక్కసారిగా వాంతులు చేసుకొని అపస్మారక స్థితిలో చేరుకుంది. గమనించిన కూలీలు 108 వాహనానికి ఫోన్ చేశారు. వాహనం వచ్చే సమయానికే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఉపాధి ఏపీఓ రవిప్రకాష్, సిబ్బంది గ్రామానికి చేరుకుని లక్ష్మిదేవి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచ్ రామ్మోహన్, ఉప సర్పంచ్ దండేలా పార్థ సారథిరెడ్డి నివాళులర్పించారు.

పంట నష్టం లెక్క తేల్చారు

- మార్చి 17న బీభత్సం సృష్టించిన వడగళ్ల వాన
- నియోజకవర్గంలో 4,910.658 హెక్టార్లలో పంట నష్టం
- బాధిత రైతులు 6,090
- నష్ట పరిహారం రూ.6,11.54,874 కోట్లు
- ప్రభుత్వానికి నివేదికలు అందజేసిన అధికారులు

మార్చి 17 రాత్రి.. పొద్దు పోయే వరకు వాతావరణంలో ఎలాంటి మార్పులేదు. అర్ధరాత్రి ఒక్కసారిగా నియోజకవర్గంలో ప్రారంభమైన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. బండరాళ్ల లాంటి వడగళ్ల ధాటికి వరి, మొక్కజొన్న, మినుపు పైర్లు నేలవాలాయి. పంట చేతికొచ్చిన దశలో అకాల వర్షం కారణంగా రైతన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులు, దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు పారదర్శకంగా సేకరించారు. త్వరలోనే ప్రభుత్వం పరిహారం అందజేయనుంది.


ఓబులంపల్లి వద్ద నేలవాలిన మొక్కజొన్న పంట నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయాధికారులు

ఆళ్లగడ్డ: మార్చిలో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన పంటల లెక్క తేలింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 6,090 మంది సాగుదారులకు చెందిన 4,910.658 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. ఇందుకు గాను రూ.6,11.54,874 నష్టపరిహారం అన్నదాతలకు అందజేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు.

విరుచుకుపడిన వడగళ్లు..
మార్చి 17 రాత్రి నియోజకవర్గంలో ప్రారంభమైన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. దీంతో పలు చోట్ల రేకుల ఇళ్లకు చిల్లులు పడ్డాయి. వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. అలాగే..పిడుగుపాటుకు శిరివెళ్ల మండలంలో ఒక వ్యక్తి మృతి చెందగా, అనేక చోట్లు వేల సంఖ్యలో గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి. తెల్లారేసరికి 175 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. దీంతో చేతికొచ్చే దశలో ఉన్న మొక్కజొన్న, వరి, మినుము తదితర పంటలకు తీవ్ర స్థాయిలో నష్టం వాటిల్లింది.

పారదర్శకంగా వివరాల నమోదు..
వర్షం కురిసిన మరుసటి రోజు నుంచి అధికారులు పంట నష్టం అంచనాపై క్షేత్రస్థాయిలో పర్యటించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హుటాహుటిన సాయంత్రానికి నియోజకవర్గానికి వచ్చి నష్టపోయిన రైతులను ఓదార్చి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పారదర్శకంగా, మానవతా దృక్పథంతో పంట నష్టం అంచనా వేయాలని, ఒక్క రైతు కూడా బాధపడకుండా చూడాలని విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చర్యలు తీసుకుందామని చెప్పడంతో.. అధికారులు పక్కాగా లెక్క తేల్చారు. గ్రామ స్థాయిలో పంటల వారీగా 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయిన రైతుల వివరాలు, పంట నష్టాన్ని నమోదు చేశారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశారు.

మండలాల వారీగా పంట నష్టం వివరాలు ..

మండలం	నష్టపోయిన రైతులు	దెబ్బతిన్న పంటల విస్తీర్ణం హెక్టార్లలో	అందనున్న పరిహారం
ఆళ్లగడ్డ	2240	1737.3	రూ. 2,08,68,135
చాగలమర్రి	1279	1265.19	రూ. 1,70,80,065
శిరివెళ్ల	115	107.038	రూ. 13,38,350
రుద్రవరం	1563	1103.31	రూ. 1,41,84,173
ఉయ్యాలవాడ	886	691.65	రూ. 76,35,651
దొర్నిపాడు	7	6.44	రూ. 48,500
మొత్తం	6,090	4,910.658	రూ. 6,11.54,874

సామాజిక తనిఖీతో స్పష్టత..
పంట నష్టం అంచనాల్లో ఎక్కడా పొరపాటు జరగకుండా నిజంగా పంట కోల్పోయిన సాగుదారుడికి ఏమాత్రం నష్టం జరగకుండా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. గ్రామస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో అంచనాలు తయారు చేశారు. వాటిని మూడు రోజుల పాటు స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ నిర్వహించారు. సబంధిత జాబితా ఆర్బీకేల వద్ద ప్రదర్శించారు. తుది జాబితాను ప్రభుత్వానికి నివేదించారు.

మొక్కజొన్న రైతుకు తీవ్ర నష్టం..
నియోజకవర్గంలో 4,910.658 హెక్టార్లలో పంట నష్టం జరుగగా ఇందులో ముడు వేల హెక్టార్లకు పైగా మొక్కజొన్న పంట దెబ్బతినింది. రుద్రవరం మండలంలో 860 హెక్టార్లు, చాగలమర్రి 1,163, శిరివెళ్ల 102 , ఆళ్లగడ్డ 1,491, ఉయ్యాలవాడ మండలంలో 250 హెక్టార్లలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు తేలింది. త్వరలోనే నష్టపోయిన రైతుల ఖాతాలో పరిహారం జమవుతుందని అధికారులు చెబుతున్నారు.


పంటలు నష్టపోయిన వివరాలను సీఎం వైఎస్ జగన్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ గంగుల

ఒక్క రైతు నష్టపోకుండా చర్యలు



మార్చిలో కురిసిన అకాల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి పంట నష్ట అంచనాలు తయారు చేయించాం. రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీలు చేపట్టి నష్టపోయిన పంటల వివరాలు, రైతుల జాబితాను ప్రదర్శించాం. పంటల వారిగా ఇన్‌పుట్ సబ్సిడీ లెక్కించి ప్రభుత్వానికి నివేదించాం. ఒక్క రైతు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. – రామ్మోహన్‌రెడ్డి, ఏడీఏ, ఆళ్లగడ్డ

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సమీక్ష

నంద్యాల(సిటీ): పట్టణంలోని 43 సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సమీక సమావేశం నిర్వహించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన వార్డులలో నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతిపై గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే గ్రామవార్డు సచివాలయాలపై రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌కు సుస్థిరాభివృద్ధికి సంబంధించిన లక్ష్యాల సాధన పురోగతిపై నివేదికలు అందించాలన్నారు. కన్సిస్టెంట్ రిథమ్, ఆధార్ అప్‌డేషన్, ఎస్‌డీజీ సర్వే, పీఎంజేఏవై, సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్, ఏపీ సేవా సర్వీసులు తదితర అంశాలను ప్రాతిపదికగా చూస్తారన్నారు.శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు


ఎమ్మెల్యేకు లంబాడి సంప్రదాయంలో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం ఓ.జి తండాలో బుధవారం స్వామి మహరాజ్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గంగల బిజేంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గిరిజనల మహిళలు లంబాడి సంప్రదాయంలో నృత్యం చేస్తూ స్వాగతం పలికారు. నాయకులు బాబులాల్, కుమార్‌రెడ్డి, పత్తి నారాయణ, గణేష్ రెడ్డి, తోడేండ్లపల్లి సర్పంచ్ గోవిందయ్య ఉన్నారు.

వాడ వాడలో అభివృద్ధి

నంద్యాల(సిటీ): పట్టణంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు, డ్రైన్లను నిర్మిస్తూ అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 10వ వార్డు ముల్లాన్ పేటలో రూ.15లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్‌మాబున్నిసాతో కలిసి బుధవారం ప్రారంభించారు. ముందుగా వార్డులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టణం అభివృద్ధిలో దూసుకెళ్తుంటే టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం చూస్తుంటే వారికి దృష్టిలోపముండొచ్చని ఎద్దేవా చేశారు. కౌన్సిలర్ అబ్దుల్ మజీద్, మున్సిపల్ అధికారులు, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, కౌన్సిలర్లు ఆరిఫ్, నాయకులు అనిల్ అమృతరాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

సామాజిక తనిఖీ సభ్యులకు శిక్షణ

గోస్పాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనుల తనిఖీకి సంబంధించిన సామాజిక తనిఖీ సభ్యులకు ఎస్‌ఆర్పీ కన్నారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.6.80కోట్లు, పంచాయితీరాజ్‌కు సంబంధించి రూ.1.50కోట్ల పనుల నిర్వహణ పై సామాజిక తనిఖీ చేస్తారని చెప్పారు. పనుల నిర్వహణ, నాణ్యతపై సామాజిక తనిఖీ బృందం పరిశీలించి నివేదిక అందజేస్తుందని, ఇందులో భాగంగా 11మంది డీఆర్పీలు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లో ఉపాధి పనులను తనిఖీ చేస్తారని చెప్పారు.

మొక్కజొన్న పంట దగ్ధం


కాలిపోయిన మొక్కజొన్న పంట

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం గొట్లూరు గ్రామంలో ప్రమాదవశాత్తు మహిళా రైతుకు చెందిన 2.5 ఎకరాల్లోని మొక్కజొన్న పంటకు నిప్పంటుకుని పంట దగ్ధమై ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దేవి అనే మహిళా రైతు తన పొలంలో మొక్కజొన్న సాగు చేసింది. రెండు మూడు రోజుల్లో కోతకోసి నూర్పిడి చేసుకోవాలనుకుంటుండగా బుధవారం పొలం దగ్ధమవుతున్నట్లు గమనించిన సమీప రైతులు సమాచారం అందజేశారు. ఆమె పొలం వద్దకు వచ్చి చూసి ఆళ్లగడ్డ అగ్నిమాపక శాఖకు విషయం తెలియజేసిం ది.వ వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో పంటతో పాటు విద్యుత్ మోటర్, పైపులు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటినట్లు బాధితురాలు వాపోయింది.

ఘనంగా పెద్దమ్మ దేవర


పూజలందుకుంటున్న పెద్దమ్మ

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామంలో పెద్దమ్మ దేవరను గ్రామ రైతు సంఘం పెద్దల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం చేసి, ప్రధాన కూడలి వద్ద కొలువుంచి పూజలు చేశారు. ఆనవాయితీ ప్రకారం దేవర క్రతువును సంప్రదాయబద్ధంగా చేపట్టారు. క్రతువు ముగిశాక గ్రామస్తులు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, పళ్లతో పాటు నవధాన్యాలతో నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, మాజీ మంత్రి అఖిలప్రియ, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, సర్పంచ్ జనపాల సాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి తదితరులతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పెద్దమ్మను దర్శించుకుని పూజలు చేశారు. గ్రామంలో 40 సంవత్సరాల తరువాత దేవర చేపట్టడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): వేసవి సెలవుల సందర్భంగా యువతీ, యువకులు ఉచిత ఉర్దూ బోధన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జమాతె ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ సమద్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా కుల మతాలకు అతీతంగా ఉచిత ఉర్దూ బోధన తరగతులను చాంద్ బాడ వీధిలోని క్రాంతి రేఖ గ్రంథాలయంలో నిర్వహిస్తామన్నారు.పురుషులకు ఈ నెల 5వ తేదీ నుంచి, మహిళలకు 8వ తేదీ నుంచి వేర్వేరుగా తరగతులు ఉంటాయని చెప్పారు. వివరాలకు 9703838759 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సంక్షిప్తం

కార్డుదారులకు జొన్నలు పంపిణీ
నంద్యాల: ప్రభుత్వం పేద ప్రజలకు బలవర్థకమైన ఆహారాన్ని అందించాలని రేషన్ కార్డుదారులకు కిలో బియ్యం బదులు కిలో జొన్నలు ఉచితంగా పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పెద్ద బండ వద్ద కార్డుదారులకు జొన్నలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, కౌన్సిలర్ పిల్లి శిరీష, పిల్లి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
నంద్యాల(అర్బన్): నిరుద్యోగులైన ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడునాగరాముడు కోరారు. ఏఐవైఎఫ్ 64వ వ్యవస్థాప దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కార్యాలయంలో బుధవారం జెండా ఆవిష్కరణ గావించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రనత్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగరాముడు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులు ఎందరో ఉపాధి అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు విష్ణు, మహేష్, రవి, శేఖర్, ధనుంజయుడు పాల్గొన్నారు.

పంటల్లో వర్షపు నీటిని తొలగించండి
నంద్యాల(అర్బన్): ఇటీవల కురుస్తున్న వర్షాలతో రబీ పంటల పొలాల్లో నిలిచిన నీటిని తొలగించకపోతే వివిధ రకాల తెగుళ్లు సోకే ప్రమాదముందని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటి ముంపుకు గురైన మొక్కలకు మొదలు కుళ్లు, వేరు కుళ్లు ఆశించి నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు అధిక వర్షాల వల్ల మొగ్గ, పూత రాలిపోతుందని, నిలిచిన నీటిని కాల్వలు తీసి దిగవకు వెళ్లేలా చేయాలని పేర్కొన్నారు. పొలం ఆరిన తర్వాత ఎకరాకు 25 కేజీల యూరియా, 25కేజీల పొటాష్ వేయాలని సూచించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయొద్దు
నంద్యాల(అర్బన్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చర్యలను ఆపాలని కోరుతూ సీఐటీయూ,ఏఐటీసీ, ఏఐటీయూసీ, సీపీఐ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీనివాస సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు ఏఐటీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లలితమ్మ మాట్లాడారు. లక్ష్మణ్, శ్రీనివాసులు, బాబఫక్రుద్దీన్, రాజశేఖర్, వెంకటలింగం, నాగరాముడు, ధనుంజయుడు పాల్గొన్నారు.

మత రాజకీయాలను సహించం
నంద్యాల(అర్బన్): ఎన్నికలలో పబ్బం గడుపుకునేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలను ప్రోత్సహిస్తే సహించేది లేదని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యూనుస్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నాటక ఎన్నికల మేనిఫెస్టోలో ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి రోజు అర లీటర్ నందిని పాలు ఇస్తామని చెప్పడం విడ్డూరమన్నారు. ముస్లింల 4శాతం రిజర్వేషన్లు అమలు చేయబోమంటూ ప్రధాని చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా మత రాజకీయాలు మానుకుని ప్రజలకు స్వచ్ఛమైన పాలనను అందించాలని కోరారు. నాయకులు సయ్యద్‌గులాబ్, నూర్‌బాషా, అబ్బాస్ అలీ పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి గడపలో ఆనందం

దొర్నిపాడు: నవరత్నాల పథకాలతో పేదల ఇళ్లల్లో ఆనందాలు విరబూస్తున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఐదో రోజు కొనసాగించారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అనే విషయాన్ని ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే బుక్‌లెట్‌ను అందజేసి పథకాల గురించి వివరించారు. దొర్నిపాడు సచివాలయం–2లో 4,380 మంది లబ్ధిదారులకు రూ.9.97 కోట్లను వివిధ పథకాల కింద సీఎం వైఎస్ జగనన్న అందజేశారని చెప్పారు. ఆసరా 452, అమ్మఒడి 328, వైఎస్సార్ పెన్షన్ కానక 440, వైఎస్సార్ సున్నావడ్డీ 633, వైఎస్సార్ చేయూత 170, వైఎస్సార్ రైతు భరోసా 432 తదితర పథకాల కింద లబ్ధిపొందారని వివరించారు. ప్రతి పక్షనాయకుడు చంద్రబాబు, ఆయన అనుచరులు అధికార దాహంతో, మోసపూరిత మాటలతో ప్రజలను నమ్మించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరడంతో వెంటనే పరిష్కరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచ్ దేవమణి, వైస్ ఎంపీపీ లక్ష్మిదేవి, సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు కాకనూరు మనోహర్‌రెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, పయిడేలా శివరామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భూమా శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీపతి ప్రసాద్, వెంకటకుళాయి, బత్తుల రాజు, ఉప సర్పంచ్ లక్ష్మిరెడ్డి, నడిపెన్న, బత్తుల కృష్ణయ్య యాదవ్, పాదం శీను, పీఎంసీ చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపీడీఓ నాగఅనసూయ, తహసీల్దార్ జయప్రసాద్, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, మండల సర్వేయర్ మల్లయ్య, విద్యుత్ శాఖ ఏఈ రామ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


పథకాల లబ్ధిని వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ అందజేత

ఆళ్లగడ్డ: మండలంలోని బత్తలూరు గ్రామానికి చెందిన పూల సుబ్బమ్మ ఇటీవల కాలు విరిగి నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. పింఛన్ తీసుకునేందుకు రాలేని స్థితిలో ఉండటంతో వలంటీర్ రమేష్ అక్కడికి పింఛన్ సొమ్మును అందజేశారు.


సుబ్బమ్మకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్

హామీలు నెరవేర్చడంలో జగనన్నది నూతన చరిత్ర

నంద్యాల/నంద్యాల(రూరల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే నూతన చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 42వ వార్డులో కౌన్సిలర్ పిల్లి శిరీషతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల ప్రజల చిరకాల కోరిక అయిన నంద్యాల జిల్లా ఏర్పాటుతో పాటు మెడికల్ కళాశాల, ఆసుపత్రి నిర్మాణం చేపట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని. దీన్ని చూసి ఓర్వలేక టీడీపీ అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరంలో మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం అవుతాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, నాయకులు కిరణ్‌కుమార్, సాదిక్‌బాషా, లక్ష్మీనారాయణ, అమృత్‌రాజ్ పాల్గొన్నారు.


పెద్దకొట్టాలలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

పెద్దకొట్టాలలో...
నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో ఎమ్మెల్యే నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముందుగా గ్రామానికి చేరుకున్న ఆయనకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని ఇళ్ల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే వారికి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలను అందజేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టిప్రభాకర్, సర్పంచ్ వెంకటరాముడు, పార్టీ మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, నాయకులు శివనాగిరెడ్డి, రవి, రవికుమార్‌రెడ్డి, బాలశివారెడ్డి, జగదీశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు చర్చి వార్షికోత్సవం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలోని సీఎస్ఐ చర్చి 5వ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘ పెద్దలు బుధవారం తెలిపారు. పరిశుద్ధ మత్తయి చర్చి నిర్మించి ఐదేళ్లు అవుతున్న సందర్భంగా ముఖ్య అతిథిగా ది రైట్ రెవరెండ్ డాక్టర్ పుష్పలలిత బిషప్ (నంద్యాల అధ్యక్ష ఖండము) రానున్నారని చెప్పారు. ప్రాస్ట్రేట్ చైర్మన్ రెవరెండ్ డేవిడ్ పుష్పరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని, రాత్రి చెక్కభజన ఉంటుందని తెలిపారు.


వార్షికోత్సవానికి ముస్తాబైన సీఎస్ఐ చర్చి